# బాల గంధర్వులు



కె.ఎం.వి.జి. కృష్ణమూర్తి

**మార్గశిర మాసపు చలి వణికిస్తోంది. కనుచూపు మేర మంచు వెండిలా, అజ్ఞానపు తెరలా దట్టంగా ఆవరించుకుంది. వెండిలా తెల్లగా ఉన్న మంచును చీల్చుతూ ఉదయించే సూర్యుని వెలుగు తెరలు, గురుముఖంలోంచి వెలువడే జ్ఞానపుంజాల్లా ఉన్నాయి.**

పచ్చగా పరుచుకుంటున్న ఆ కాంతి నేలను స్వర్ణమయం చేస్తోంది. ప్రకృతి రజత మయంగానూ, స్వర్ణమయంగానూ ఉంది. ఇరు వంకలా చేలు, మధ్యలో భూమాత నొసట కుంకుమ రేఖలా ఉన్న కంకర రోడ్డుపై మదగజేంద్రయానలా బస్సు పోతూంది. మట్టిని పుప్పొడిలా వెదజల్లుతూ, అందమైన చిత్రపటం మీద అర్థం లేని రంగును చిలకరిస్తోంది.

"శేషశైలావాస శ్రీవెంకటేశా .." అంటూ పాట బస్సు రొదను మించి నా చెవుల్లోకి చేరింది. ప్రైవేటు బస్సులో ఎలాంటి కేసెట్టూ లేకుండా వచ్చిన సంగీతం నన్ను పరవశుణ్ని చేసింది. కళ్లు మూసుకోగా శ్రీనిలయమే కనపడింది.

❀ ❀ ❀

కూసే కోళ్లన్నీ పౌల్ట్రీ ఫారాల్లో తల దాచుకున్నాయి. అ యినా కోడి కూత వేళ వెంకటమ్మకు మెలకువ వచ్చింది. వెంటనే కూతురు సుమిత్రను లేపింది.

"సుమిత్రా! లేవే! తెల్లారింది."

సుమిత్ర బద్ధకంగా అటూ ఇటూ పొర్లింది.

చింకి చాప మీద, చల్లని నేల మీద. కప్పుకున్న చిరుగుల దుప్పటి ఆమెను చలికి బలి చేస్తూంది. తన చిన్నారి చేతుల్ని ఆ తల్లి మెడ చుట్టూ వేసింది.

"ఏం మొద్దు నిద్రే అమ్మా? లే! లే తొందరగా!"

వెంకటమ్మకు చెరో పక్కనా కొడుకూ, కూతురూ పడుకున్నారు.

"అప్పుడే తెల్లారిందా? రాముడు లేవలేదు కదా!"

"వాడూ లేస్తాడు. నువ్వు ముందు లే!" అంటూ రాముణ్ని మోచేత్తో పొడిచింది. వెంకటమ్మకు కూడా చలి ఉంది.

"అబ్బ లేస్తానే. ఉండు."

"అలా అంటే ఎలాగే? ఆరు గంటల బస్సుకు టైమైంది."

"రాత్రి చివరి బస్సుకు వచ్చాం కదా! ఇంకొంచెం సేపు పడుకోనివ్వవే!"

"నువ్వే అలా అంటే రాముడు మొండి కేస్తాడు." వెంకటమ్మ సుమిత్ర లేచే దాకా వదల్లేదు.

రాముడూ లేచాడు బలవంతంగా. వెంకటమ్మా లేచింది.

ఊరింకా గాఢనిద్రలోనే ఉంది. ప్రపంచం మత్తులో ఉం ది. నిండా పదేళ్ళు లేని పసికూనలు వాళ్ళు. సుమిత్రకు ఎనిమిది, రాముడికి ఆరు.

కాలకృత్యా లయ్యాయి.

వాళ్ళు వేసుకున్న బట్టలు వాళ్ళ శరీరాల్ని కప్పే ప్రయత్నం చేసినా, వాళ్ళను చలి పాలు చేస్తూనే ఉన్నాయి. పాల బుగ్గల పసి వాళ్ళు, మంచు ముద్దల్లా అయ్యారు.

'వెళ్ళే ముందు దేవుడికి దణ్ణం పెట్టుకుని మరీ వెళ్ళండి.'

'సింహాద్రి అప్పన్నకూ, తిరుమల వెంకన్నకూ, పూరీ జగన్నాథుడికీ కూడా ఏకముఖంగా మొక్కుకున్నారు. చింకి తడికల పూజామందిరంలో దేవుళ్ళు కూడా చలికి తాళలేక ముడుచుకు పడుకున్నట్టుంది, ఆ మసిబారిన ఫొటోలు చూస్తే.

చంకలో సంచీలో దేవుడి ముందరున్న చిడతలు కళ్ళ కద్దుకుని మరీ పెట్టుకున్నారు. వెంకటమ్మ వాళ్ళ కనుమరుగయ్యే దాకా నుంచుంది. కళ్ళు చెమర్చాయో లేదో కాని, తుడుచుకుంది.

కన్ను పొడుచుకున్నా కనిపించని చీకటి. వెలుగొస్తున్నా ముసురుకున్న రేచీకటిలా మంచు తెర. సూదుల్లా గుచ్చుకునే చలి.

పేద వాడి బతుకులా మినుకుమినుకుమనే పంచాయితీ దీపాలు వాళ్ళకు మార్గదర్శకాలు. అదీ పంచాయితీ రోడ్డు దాకా వస్తేనే. వాళ్ళింటికి అవి సప్తర్షి మండలంలా కనిపిస్తు న్నాయి.

కాలి బాటా, చేల గట్లూ దాటి వాళ్ళు ఊళ్ళోకి వచ్చారు. వాళ్ళ పసిపాదాలు చలికి బీటలు వారుతున్నాయి. ఊరు దాటి పెద్ద రోడ్డు మీదకు వచ్చే సరికి వీళ్ళ లాగే సూర్యుడు కూడా ధైర్యంగా ఆకాశం మీదకు వస్తున్నాడు.

సరిగ్గా ఈ కథ మొదట్లో వర్ణించిన ప్రకృతి దృశ్యం అప్పుడే రూపు దిద్దుకుంటోంది. ఈ పిల్లలు కూడా తమ దినచ ర్యకు అప్పుడే నాంది పలికారు.

దూరంగా దిక్చక్రపు లోతు ల్లోంచి మొలుచుకొచ్చిన తిన్నని రోడ్డు మీద రోకలిబండలా ఎర్రటి బస్సును వాళ్ళు చూశారు.

వీళ్ళను చూసిన డ్రైవరు బస్సును ఆపాడు. బస్సులో ఎక్కారు.

❀ ❀ ❀

"జయ కృష్ణా ముకుందా మురారీ!
జయ గోవింద బృందావిహారీ!"

ఏ నాడో విన్న పాట మళ్ళీ వీనులవిందుగా వినబడు తోంది. గానాన్ని ఇనుమడింపచేసే తాళగతి. 'శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గానరసం ఫణిః' అన్నారు.

శిశుప్రాయులైన ఈ బాలగంధర్వులు తమ గానమాధురితో మొత్తం లోకాన్నే జాగృతం చేస్తున్నారు. బస్సు రొద శ్రుతికి అవరోధ మవుతోంది. లేకుంటే అది గంధర్వగానమే, నేనున్నది హిమవన్నగమే అవుతుంది.

పాట ఆగిపోయింది. నా ఆలోచనలూ ఆగిపోయాయి. ఆ పిల్లలు నా దగ్గరికి కూడా వచ్చి చేయి చాపారు. చేతిలో చిల్లర ఉంది. దాంతోటి కూడా వాళ్ళ తాళబద్ధంగా కదులుతూ బస్సులో మనుషుల వితరణశీలతనూ, మానవతనూ మే ల్కొల్పాలని చూస్తున్నారు. బీదా బిక్కీ బతుకు పోరులో, కష్టాల ఏటిలో కొట్టుకు పోతున్న వాళ్ళు ఆ చిన్నారుల కేమిస్తారు, చిల్లర నాణాలు తప్ప?

వాళ్ళిద్దరికీ చెరో రూపాయి నోటూ ఇచ్చాను. కొత్త రూపాయి నోట్లు చూసి వాళ్ళ ముఖాలు పువ్వుల్లా విచ్చుకున్నాయి. కష్టార్జితానికి మసి పూసి, మసిబారిన నోట్లను రొంటిలో దోపుకునే ఆ పల్లె ప్రజలు ఆశగా చూశారు. ఆ పిల్ల ల పేర్లడిగాను. "సుమిత్రా, రాముడూ" అన్న పేర్లు బస్సు రొదలో లీలగా వినిపించాయి. బస్సు ఆగింది. దిగుతుంటే కండక్టరు ఆ పిల్లల దగ్గర నోట్లు తీసుకుని వేరే నోట్లు ఇచ్చా డు. ఆ అన్యాయాన్ని కళ్ళారా చూసి దిగమింగుకున్నాను.

పిల్ల లిద్దరూ ఎదురు గుండా వచ్చే బస్సులో ఎక్కారు.

పర్లాకిమిడిలో పని చూసుకుని తిరిగి వస్తుంటే రాత్రి బస్సులో మళ్ళీ కనిపించారు. అప్పటికే దాదాపు ఏడు గంటలైంది. చీకటి లోకాన్ని కప్పేసింది. బస్సులో వెలుగు సన్యాసి హృదయంలో జ్ఞానదీపంలా ఉంది.

ఇంటికి చేరాక కూడా వాళ్ళ గానమాధురి నన్ను వెంటా డుతూనే ఉంది. రోజంతా పాడినా ఆ పసి గొంతుకలు వసి వాడలేదు, శ్రుతి తప్పలేదు, జీర పోలేదు.

ఆ కంఠమే వాళ్ళ పాలిటి శాప మైందా? బ్రతుకే నిత్య పాట కచేరీ అయిందా? ప్రయాణికు లిచ్చే చిరు కాసులు వాళ్ళ గానానికా? వాళ్ళ దురవస్థకా? బస్సు కండక్టరు వాళ్ళ కొత్త నోట్లు లాక్కున్నట్టే, వాళ్ళమ్మ కూడా వాళ్ళ కంఠార్జితాన్ని గుప్పిట్లో పెట్టుకుంటుందా?

అనుమానాల రొదలో, బస్సు రొదలో కీచుమనే కంఠ ధ్వనిలో, నాకా రాత్రి కలత నిద్రే అయింది. ఇచ్ఛాపురం సోంపేట మార్గంలో బస్సులో వెడితే ఆ పిల్లలిద్దరూ కనపడితే అడిగానని చెబుతారు కదూ?

బహుశా ఇప్పుడు వాళ్ళు బాగా పెద్ద వాళ్ళై ఉంటారు. జీవనసమరంలో మరింత రాటుదేరి ఉంటారు. "ముస్తఫా ముస్తఫా డోంట్ వర్రీ ముస్తఫా" అని అందరికీ ధైర్యం చెబుతూ ఉంటారేమో!

